పట్టణాలకు దీటుగా పల్లెల అభివృద్ధి

రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణ పనుల శంకుస్థాపనలో ఎమ్మెల్యే కూనంనేని

పాల్వంచ రూరల్, మే 21:పట్టణాలకు దీటుగా పల్లెలను అభివృద్ధి చేయడమే తన ధ్యేయమని స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మండలంలోని నాగారం కాలనీ, రంగాపురం, దంతెలబోర, నారాయణరావుపేట, సంగం, సోములగూడెం, లక్ష్మీదేవిపల్లి(ఎస్) గ్రామాల్లో బుధవారం పర్యటించిన ఆయన.. రూ.4.49 కోట్లతో చేపట్టిన రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేసారు. ఈ సందర్భంగా నాగారం కాలనీలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ప్రణాళిక ప్రకారం ప్రతీ వీధిలోనూ రోడ్ల నిర్మాణాలు చేపట్టనున్నట్లు చెప్పారు. అలాగే, పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టి త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. జిల్లాలోని రైతుల కష్టాలు తీర్చే విధంగా సీతారామ ప్రాజెక్టు కాలువల నిర్మాణాలు చేట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. తహసీల్దార్ దారా ప్రసాద్, ఎంపీడీవో విజయభాస్కర్‌రెడ్డి, డీఈ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టీజేఎఫ్ రజతోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

కొత్తగూడెం అర్బన్, మే 21: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో జర్నలిస్టులు కీలకపాత్ర పోషించారని టీజేడబ్ల్యూయూ (టీజేఎఫ్) జిల్లా అధ్యక్షుడు కల్లోజి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు కాగితపు వెంకటేశ్వరరావు అన్నారు. కొత్తగూడెం క్లబ్‌లో టీజేఎఫ్ రజతోత్సవ పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించిన సందర్భంగా వారు మాట్లాడారు. ఈ నెల 31న హైదరాబాద్‌లో నిర్వహించనున్న జర్నలిస్టు జాతర రతజోత్సవానికి భద్రాద్రి జిల్లా నలుమూలల నుంచి జర్నలిస్టులు హాజరు కావాలని కోరారు. షఫీ, వట్టికొండ రవి, అచ్చిరెడ్డి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలు, పోక్సో చట్టాలపై..
టీచర్లు అవగాహన కలిగి ఉండాలి: డీఎస్పీ

పాల్వంచ, మే 21:టీచర్లందరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని పాల్వంచ డీఎస్పీ సతీశ్‌కుమార్ సూచించారు. పాత పాల్వంచ హైస్కూల్లో జరుగుతున్న జిల్లా స్థాయి జీవశాస్త్ర ఉపాధ్యాయుల శిక్షణ తరగతుల్లో 'సైబర్ క్రైం, పోక్సో, మానవ రవాణా చట్టాల'పై బుధవారం ఆయన అవగాహన కల్పించారు. టెక్నాలజీ పెరగడంతో సైబర్ నేరగాళ్లు రకరకాల పద్ధతిలో ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు. లాటరీ తగిలిందని, బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామని, సీబీఐ అధికారులమని చెబుతూ బెదిరింపులకు పాల్పడుతున్నారని అన్నారు. ఫేక్ కాల్స్ జోలికి వెళ్లవద్దని, సోషల్ మీడియా లింక్స్ ఓపెన్ చేయవద్దని సూచించారు. హెచ్ఎం, కోర్సు డైరెక్టర్ పద్మలత, ప్రముఖ కవి సురేశ్‌బాబు, డీఆర్‌పీలు ఎడారి ప్రకాశ్, పరమయ్య, కమలాకర్, జయబాబు తదితరులు పాల్గొన్నారు.

టీజీఆర్‌జేసీలో కొత్తగూడెం విద్యార్థికి తొలి ర్యాంకు

చుంచుపల్లి, మే 21:ఎలాంటి కోచింగ్ లేకుండానే పదో తరగతి బోర్డు పరీక్షల ప్రిపరేషన్‌తో టీజీఆర్‌జేసీ సెట్‌లో తమ విద్యార్థి రాష్ట్రంలో తొలి ర్యాంకు సాధించడం గర్వకారణంగా ఉందని కొత్తగూడెం దన్బాద్ సెయింట్ జోసెఫ్ ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ బ్రదర్ రాజశేఖర్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఇటీవల విడుదలైన తెలంగాణ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీ కామన్ ఎంట్రన్స్ టెస్టు ఫలితాల్లో తమ పాఠశాల విద్యార్థి బొమ్మిశెట్టి చాణక్య అభినవ రాష్ట్రస్థాయిలో తొలిర్యాంకు సాధించినట్లు చెప్పారు. కేవలం పదో తరగతి పరీక్షల ప్రిపరేషన్‌తోనే ఈ పరీక్షల్లో సత్తా చాటడం అభినందనీయమని అన్నారు.

పంటమార్పిడి విధానాన్ని అవలంబిద్దాం

కేవీకే కో ఆర్డినేటర్ లక్ష్మీనారాయణమ్మ

కొత్తగూడెం టౌన్, మే 21: పంటల్లో సుస్థిర ఆదాయాన్ని పొందాలంటే పంట మార్పిడి విధానాన్ని విధిగా పాటించవలసిన ఆవశ్యకత ఉందని కేవీకే కో ఆర్డినేటర్ లక్ష్మీనారాయణమ్మ పేర్కొన్నారు. అందుకని రైతులందరూ ఆ విధానాన్ని అవలంబించాలని సూచించారు. 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమంలో భాగంగా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు సుజాతనగర్ మండలంలోని సీతంపేట బంజర గ్రామంలో బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా రైతులతో ఆమె మాట్లాడుతూ. పంటల సాగుకు అనువుగా యూరియాను, మోతాదు మేరకు రసాయన ఎరువులను మాత్రమే వినియోగించాలని సూచించారు. శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు శివ, స్రవంతి, ప్రనూష తదితరులు పాల్గొన్నారు.

26న అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు

కొత్తగూడెం టౌన్, మే 21:జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 26న సాయంత్రం 5 నుంచి 8 గంటల వరకు పాల్వంచ శ్రీనివాసకాలనీ జిల్లా స్పోర్ట్స్ అథారిటీ గ్రౌండ్‌లో జిల్లా సబ్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తారని అసోసియేషన్ జనరల్ సెక్రటరీ మహిధర్ బుధవారం తెలిపారు. ఈ ఎంపికల్లో 8 ఏళ్లలోపు బాలబాలికలకు 60 మీటర్లు, 200 మీటర్ల పరుగు పందెం పోటీలు ఉంటాయన్నారు. అలాగే.. బాల్ త్రో, స్టాండింగ్, లాంగ్‌జంప్ విభాగాల్లో పదేళ్లలోపు బాలబాలికలకు 60 మీటర్లు, 300 మీటర్లు పరుగుపందెం, లాంగ్‌జంప్, కిడ్స్ జావెలిన్ ఉంటాయన్నారు. 12 ఏళ్లలోపు వారికి 60 మీటర్లు, 300 మీటర్లు, 600 మీటర్లు లాంగ్ జంప్, కిడ్స్ జావెలిన్ త్రో అంశాల్లో పోటీలు ఉంటాయని వివరించారు.

పామాయిల్‌లో అంతర పంటగా మునగ

ఇల్లెందు, మే 21: పామాయిల్ సాగులో అంతర పంటగా మునగ వేస్తే మంచి లాభాలు వస్తాయని జిల్లా ఉద్యాన వన శాఖ అధికారి కె.కిషోర్ అన్నారు. మండలంలోని చింతోనిచెలక గ్రామంలో పామాయిల్ సాగుపై ఉద్యాన వన, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గోద్రేజ్ ఆగ్రోవెట్ కంపెనీ ప్రతినిధులు బుధవారం రైతులకు అవగాహన కల్పించారు. పామాయిల్ సాగుకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను కిషోర్ వివరించారు. ఇల్లెందు ఏడీఏ లాల్‌చంద్, ఎంఏవో అన్నపూర్ణ, హెచ్‌వో స్రవంతి, ఏఈవో రెహానా పాల్గొన్నారు.

ABDULKALAM
INSTITUTE OF TECHNOLOGICAL SCIENCES
VEPALAGADDA,SUJATHA NAGAR,
BHADRADRI KOTHAGUDEM-507120 TELANGANA
ESTD:2007, www.akits.ac.in EMAIL ID: akits.org@gmail.com Ph: 8978716766
AKITS/Advt/2025,dt.19.05.2025

STAFF RECRUITMENT

Wanted **PROFESSORS,ASSOCIATE PROFESSOR, ASSISTANT PROFESSORS** in **MECHANICAL** Department. Interested candidates may walk in on 23/05/2025 along with all Original certificates. Qualification and Pay Scale are as per AICTE Norms.

Sd/- **Secretary & Correspondent**

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073

నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

- **పెనగడప వద్ద రోడ్డు ప్రమాదంలో తల్లీకొడుకు దుర్మరణం**
- **మృతులిద్దరూ ఆంధ్రప్రదేశ్ కోనసీమ జిల్లా వాసులు..**

పుష్కర స్నానానికి వెళ్లి వస్తూ..
అనంత లోకాలకు..

రామవరం, మే 21: కాళేశ్వరంలో సరస్వతీ పుష్కరాలను ముగించుకొని ఇంటికి వెళ్తున్న తల్లీకొడుకులను లారీ రూపంలో వచ్చిన మృత్యువు కబళించింది. ఈ ఘటన పెనగడప పంచాయతీలో మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం..

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం చిరుతపూడి గ్రామానికి చెందిన మామిడిశెట్టి వెంకటపతి.. తన కుటుంబ సభ్యులతో కలిసి ఈ నెల 19న కాళేశ్వరం వెళ్లి అక్కడ సరస్వతీ పుష్కరాల్లో స్నానాలు ఆచరించారు. తిరిగి భద్రాచలం చేరుకొని సీతారామచంద్రస్వామివారిని దర్శించుకున్నారు. అక్కడి నుంచి మంగళవారం తిరుగు పయనమయ్యారు. ఈ క్రమంలో వారి కారు చుంచుపల్లి మండలం పెనగడప పంచాయతీ చంద్రుకుంట బైపాస్‌రోడ్డు వద్దకు చేరుకుంది. అదే సమయంలో సత్తుపల్లి జేవీఆర్ ఓసీ నుంచి ఆర్‌సీహెచ్‌పీకి బొగ్గు లోడ్‌తో వెళ్తున్న లారీ ఎదురుగా వచ్చి వీరి కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తల్లి మామిడిశెట్టి కనకదుర్గ (54)


ప్రమాద స్థలంలో నుజ్జునుజ్జయిన కారు

అక్కడికక్కడే మృతిచెందింది. కారు నడుపుతున్న ఆమె కుమారుడు మామిడిశెట్టి వెంకటరత్నం (36) కారు ముందు భాగంలో ఇరుక్కున్నాడు. సుమారు రెండు గంటలపాటు పోలీసులు, లారీ డ్రైవర్లు విశ్వప్రయత్నం చేసి బయటికి తీశారు. అతడి రెండు కాళ్లు పూర్తిగా నుజ్జునుజ్జయ్యాయి. దీంతో అతడిని వెంటనే కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం విజయవాడకు తరలిస్తుండగా కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్ వద్దకు చేరుకోగానే ప్రాణాలు విడిచాడు. అదే కారులో ఉన్న మృతుల బంధువుల కుమార్తె దీక్షిత తలకు తీవ్ర గాయమైంది. ఆమెను ఖమ్మానికి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉంది. కుటుంబ పెద్ద మామిడిశెట్టి వెంకటపతి, కోడలు జ్యోతి స్వరూప, మనవడు చేతన్ శిరీష్‌లకు గాయాలయ్యాయి. ఈ ప్రమాదంపై కొత్తగూడెం టూటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఓసీ లారీల మితిమీరిన వేగం..

సత్తుపల్లి జేవీఆర్, కిస్టారం ఓసీల నుంచి వస్తున్న బొగ్గు టిప్పర్లు అతివేగంగా వస్తుండడంతో ప్రజల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. తాజాగా మహ్మద్ మౌలానా, మామిడిశెట్టి కనకదుర్గ, వెంకటరత్నంలు బొగ్గు టిప్పర్లు ఢీకొని దుర్మరణం చెందడంతో ఈ ప్రాంత ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. మితిమీరిన వేగంతో వాహనాలు నడపడమే ఈ ప్రమాదాలకు ప్రధాన కారణమని ఆరోపిస్తున్నారు.

కారుణ్య నియామకాలపై కరుణ చూపరూ...

కొత్తగూడెం ఏరియా వర్క్‌షాప్ సింగరేణి విశ్రాంత కార్మికుల వేడుకోలు

రామవరం, మే 21: విధుల్లో ఉన్నప్పుడు చెమట చుక్కలను చిందించారు. సంస్థ నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు నిరంతరం శ్రమించారు. కానీ అనారోగ్య కారణాలతో తరువాత వారు పనిచేయలేని స్థితికి చేరుకున్నారు. తమకు బదులుగా తమ వారసులకు కారుణ్య నియామకాలు కల్పించాలంటూ సంస్థకు దరఖాస్తు పెట్టుకున్నారు. శరీరంతో సత్తువ లేకపోయినా చెప్పులరిగేలా తిరుగుతూనే ఉన్నారు. అయితే.. నెలల తరబడి, ఏళ్ల తరబడి తాము తిరుగుతున్నా సంస్థ మాత్రం తమపై కారుణ్యం చూపడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారే.. సింగరేణికి చెందిన పలువురు విశ్రాంత ఉద్యోగులు. సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలోని ఏరియా వర్క్‌షాప్‌లో గతంలో మెడికల్ ఇన్ వాలిడేషన్ అయి కారుణ్య నియామకాల కోసం తమ వారసులకు అవకాశం కల్పించాలని దరఖాస్తు చేసుకున్న ఎనిమిది మంది.. అందుకు సంబంధించిన పత్రాలను సంబంధిత అధికారులకు సమర్పించారు. నెలల తరబడి తిరుగుతున్నా సంస్థ నుంచి స్పందన రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము పనిచేసిన ఏరియా వర్క్‌షాప్‌లోనే ఆరు నెలల కాలం గడిచిపోతే.. మిగతా కార్యాలయాలు ఇంకా ఎంత సమయం తీసుకుంటాయోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

క్లర్క్ ఒక్కరే ఉండడం వల ఆలస్యం..

-టీ.శ్రీకాంత్, డీవైజీఎం, ఏరియా వర్క్‌షాప్

క్లర్క్ ఒక్కరే ఉండడం వల్ల కారుణ్య నియామకాల పత్రాల పరిశీలన ప్రక్రియ ఆలస్యమవుతోంది. సాధ్యమైనంత తొందరలోనే ఈ సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం.

ఫాం పాండ్‌తో భూగర్భ జల రక్షణ

టేకులపల్లి, మే 21: భూగర్భ జలాలను రక్షించేందుకు, వాటిని భవిష్యత్ తరాలకు అందించేందుకు ఫాం పాండ్ ఉపయోగపడుతుందని స్థానిక సంస్థల


ఉపాధి పనులు పరిశీలిస్తున్న విద్యాచందన

అదనపు కలెక్టర్, డీఆర్‌డీవో విద్యాచందన అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ఉపాధి పనులను, నర్సరీలను, పండ్ల తోటలను ఆమె బుధవారం పరిశీలించారు. ఉపాధి కూలీలతో మాట్లాడారు. సులానగర్‌లో రైతు చింత రాములుకు చెందిన ఫాం పాండ్ పరిశీలించారు. రైతులతో ఆమె మాట్లాడుతూ.. రైతులు బోరు బావి ఉన్న తమ భూముల్లో ఫాం పాండ్ తప్పనిసరిగా నిర్మించాలన్నారు. భవిష్యత్ తరాలకు భూగర్భ జలాలను అందించేందుకు వ్యవసాయ భూమిలోని బోరు సమీపంలోనే ఫాం పాండ్ నిర్మించాలని అన్నారు. ఏపీవో కాళంగి శ్రీనివాస్, ఈసీ తిరుపతయ్య, పంచాయతీ కార్యదర్శులు పవిత్ర, కవిత, కృష్ణచైతన్య, సంజీవ్, సాంకేతిక సహాయకులు ఈశ్వరి, చంద్మల్, క్షేత్ర సహాయకులు సత్యనారాయణ, లకన్, పూర్ణ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

చుంచుపల్లి పీఎస్‌లో ఎస్పీ ఆకస్మిక తనిఖీ

చుంచుపల్లి, మే 21:చుంచుపల్లి పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ రోహిత్‌రాజు బుధవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం అక్కడి పోలీసు అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వివిధ సమస్యలతో పోలీసు స్టేషన్‌కు వచ్చే బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అనంతరం డిస్ట్రిక్ట్ సైబర్ క్రైమ్స్ కో ఆర్డినేషన్ సెంటర్‌ను సందర్శించారు. ఇప్పటి వరకు జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్లలో నమోదైన సైబర్ నేరాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సీఐ వెంకటేశ్వర్లు, సైబర్ క్రైమ్స్ ఇన్‌స్పెక్టర్ జితేందర్, ఎస్సై ఉమ, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

టేకులపల్లి, మే 21: అక్రమంగా తరలిస్తున్న పశువులను పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై రాజేందర్ తెలిపిన వివరాలు.. మండలంలోని ఈర్యాతండా వద్ద బుధవారం రాత్రి 7 గంటల సమయంలో పశువులతో వెళ్తున్న బొలేరో ట్రాలీని పోలీసులు ఆపారు. అందులో ఆవు, నాలుగు కోడె దూడలు, రెండు పేయ దూడలు ఉన్నాయి. వీటిని తరలించేందుకు అనుమతి పత్రాలు లేకపోవడంతో వాహనాన్ని సీజ్ చేశారు. వీటిని తరలిస్తున్న ఎండి.మునీర్, తేజావత్ ప్రసాద్, హైమద్‌పై కేసు నమోదు చేశారు.

రైతు ముంగిట్లోకి శాస్త్రవేత్తలు

అశ్వారావుపేట రూరల్, మే 21: మండలంలోని దురదపాడు, గుర్రాలచెరువు పంచాయతీ కార్యాలయాల వద్ద బుధవారం 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమాలను వ్యవసాయాధికారులు, అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు నిర్వహించారు. ఏడీఏ రవికుమార్ మాట్లాడుతూ.. లైసెన్స్‌డ్ డీలర్ల వద్దనే విత్తనాలు కొని, రశీదులు భద్రపర్చుకోవాలని చెప్పారు. సేంద్రియ ఎరువులు ఉపయోగించాలన్నారు. సాగులో యాంత్రీకరణ, భూసార పరిరక్షణ తదితరాంశాలను శాస్త్రవేత్తలు డాక్టర్ శిరీష, జాంబమ్మ వివరించారు. పశుసంవర్ధక శాఖ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ స్వప్న, మండల వ్యవసాయాధికారి శివరాంప్రసాద్ పాల్గొన్నారు.

డివైడర్ పనులను అడ్డుకున్న వ్యాపారులు

అశ్వారావుపేట టౌన్, మే 21: రోడ్డు విస్తరణ పనులను అడ్డగోలుగా నిర్వహిస్తున్నారని ఆరోపిస్తూ వాటిని స్థానిక వ్యాపారులు బుధవారం అడ్డుకున్నారు. పట్టణంలోని పొట్టి శ్రీరాములు వీధి రహదారి వైపు డివైడర్‌ను అధికారులు నిర్మిస్తున్నారు. ఈ డివైడర్‌తో పొట్టి శ్రీరాములు వీధిలోకి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉంటుందని స్థానిక వ్యాపారులు అభ్యంతరం తెలుపుతూ, నిర్మాన పనులను బుధవారం అడ్డుకున్నారు. డివైడర్ నిర్మించవద్దని కోరుతూ ఆర్‌అండ్‌బీ డీఈ ప్రకాశ్‌కు వినతిపత్రం ఇచ్చారు.

24న వైరాలో జాబ్ మేళా: ఎమ్మెల్యే

జూలూరుపాడు, మే 21: నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈ నెల 24న వైరాలో నిర్వహించనున్న మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ కోరారు. ఈ జాబ్‌మేళా సన్నాహక కార్యక్రమాలపై జూలూరుపాడులోని ఎంపీడీవో కార్యాలయంలో పలు శాఖల అధికారులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని శాఖల అధికారులు సమసన్వయంతో పని చేసి క్షేత్రస్థాయిలో నిరుద్యోగులను గుర్తించి వారి పేర్లను రిజిస్ట్రేషన్ చేయించి జాబ్‌మేళాకు వచ్చేలా ప్రోత్సహించాలని సూచించారు. అనంతరం జాబ్‌మేళా పోస్టర్లను ఆవిష్కరించారు. తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో కరుణాకర్‌రెడ్డి, ఎస్సై రవి పాల్గొన్నారు.

గణేశ్ టెంపుల్‌లో హనుమత్ జయంతి మహోత్సవాలు

కొత్తగూడెం గణేశ్ టెంపుల్, మే 21:హనుమత్ జయంతి సందర్భంగా కొత్తగూడెంలోని గణేశ్ టెంపుల్‌లో దేవదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో శ్రీఆంజనేయ స్వామివారికి బుధవారం హనుమత్ జయంతి పూజలను నిర్వహించారు. ఈ ఆలయంలో హనుమత్ జయంతి మహోత్సవాలు ఈ నెల 23 వరకూ కొనసాగనున్నాయి. తొలిరోజు మంగలవాయిద్యాలు, మంగళతోరణాలు, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, దీక్షాధారణ, రక్షాబంధనం, విశేష పంచామృతాభిషేకం, సహస్ర నామార్చన తదితర పూజలు నిర్వహించారు. భక్తులు అదిక సంఖ్యలో హాజరయ్యారు. ఈవో రజినికుమారి, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు

కొత్తగూడెం గణేశ్ టెంపుల్, మే 21:2025-26 విద్యా సంవత్సరంలో బడులు తెరిచే నాటికి విద్యార్థుల చేతుల్లో పాఠ్య పుస్తకాలు ఉండేలా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా విద్యాశాఖ చర్యలు ముమ్మరం చేసింది. ఈ మేరకు కలెక్టర్ సూచనలతో ఆయా పాఠశాలలకు పుస్తకాలను చేరవేసే కార్యక్రమాన్ని డీఈవో వెంకటేశ్వరాచారి బుధవారం ప్రారంభించారు. పాత కొత్తగూడెంలోని పుస్తక నిల్వ గోదాము నుంచి రెసిడెన్షియల్ పాఠశాలలకు, గురుకులాలకు, గిరిజన ఆశ్రమ పాఠశాలలకు, వివిధ ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలకు, మండల విద్యా వనరుల కేంద్రాలకు పాఠశాలలను చేరవేయనున్నారు. ఇండెంట్ ప్రకారం ఆయా స్కూళ్ల బాధ్యులకు డీఈవో బుధవారం పుస్తకాలు అందజేశారు. జిల్లాకు 5,08,400 పాఠ్యపుస్తకాలు అవసరం ఉండగా ఇప్పటి వరకు 4,01,875 పుస్తకాలు జిల్లాకు చేరినట్లు తెలిపారు. ఈ నెలాఖరు నాటికి అన్ని పుస్తకాలనూ పంపిణీ చేయనున్నట్లు చెప్పారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన 10 మందికి జరిమానా

కొత్తగూడెం టౌన్, మే 21: అతిగా మద్యం తాగి వాహనాలు నడిపిన కేసులో పది మందికి జరిమానాలు విధిస్తూ కొత్తగూడెం స్పెషల్ జుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ మెండు రాజమల్లు బుధవారం తీర్పుచెప్పారు. వన్‌టౌన్ ఎస్సై విజయ వాహనాలు తనిఖీ చేస్తుండగా ముగ్గురిని, లక్ష్మీదేవిపల్లి ఎస్సై రమణారెడ్డి వాహనాలు తనిఖీ చేస్తుండగా మరో ముగ్గురిని, పాల్వంచ టౌన్ ఎస్సై జీవన్‌రాజ్ వాహనాలు తనిఖీ చేస్తుండగా నలుగురిని ఆపి బ్రీత్ ఎనలైజర్ల ద్వారా పరీక్షించారు. దీంతో ఆయా వాహనదారులు మద్యం తాగినట్లు రుజువైంది. దీంతో వారిని సదరు పోలీసులు కోర్టులో హాజరుపర్చారు. న్యాయమూర్తి ఎదుట నిందితులు నేరం అంగీకరించడంతో జడ్జి.. వారికి జరిమానాలు విధించారు.

యూనిఫాం సిద్ధం చేయాలి

టేకులపల్లి, మే 21: పాఠశాలల పునఃప్రారంభం నాటికి విద్యార్థుల యూనిఫాం సిద్ధం చేయాలని అదనపు కలెక్టర్, డీఆర్‌డీవో విద్యాచందన అన్నారు. మండలంలోని బద్దుతండా పంచాయతీ ఆంజనేయపాలెం మహిళా శక్తి నిర్వహిస్తున్న విద్యార్థుల యూనిఫాం స్టిచ్చింగ్ సెంటర్‌ను బుధవారం సందర్శించారు. జూన్ 2వ తేదీ నాటికి యూనిఫాం సిద్ధం చేయాలన్నారు.

అన్నదానానికి విరాళం

భద్రాచలం, మే 21: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో అన్నదాన కార్యక్రమానికి బుధవారం కృష్ణా జిల్లా పమిడిముక్కల మండలం పైడి కొండలపాలెం గ్రామస్తుడు తాళ్లూరి శ్రీయదత్త రూ.2,50,000, విశాఖపట్నం మధురానగర్‌కు చెందిన గవిరెడ్డి కస్తూరి-నాయుడు దంపతులు రూ.1,00,116 విరాళంగా ఇచ్చారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహిచారు.

'ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజులు నియంత్రించాలి'

పాల్వంచ, మే 21:పాల్వంచలోని ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజులను నియంత్రించాలని బీఆర్ఎస్‌వీ అధ్యక్షుడు జూపెల్లి దుర్గాప్రసాద్ కోరారు. ఈ మేరకు డీఈవో వెంకటేశ్వరచారిని బుధవారం కలిసి వినతిపత్రాన్ని అందించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రైవేటు విద్యాసంస్థలపై పట్టింపులేకుండా పోయిందని అన్నారు. ఎన్నికల సమయంలో విద్యార్థులకు ఇచ్చిన హామీల్లో భాగంగా ఫీ రెగ్యులేటరీ కమిటీ ఏర్పాటు చేయాలని, ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల నియంత్రణకు చర్యలు చేపట్టాలని, ప్రైవేట్ విద్యా రంగంలో విద్యాసంస్థల్లో ప్రమాణాలను, నాణ్యతను పెంపొందించాలని డిమాండ్ చేశారు. ఫీజుల నియంత్రణపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. రామ్, మెహతాజ్, సైపుల్లా, పండు, నరేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో సుభాని కార్టూన్‌కు ప్రత్యేక బహుమతి

పాల్వంచ, మే 21: ప్రముఖ హాస్యపత్రిక హాస్యానందం 'ముక్కు' అనే అంశంపై నిర్వహించిన కార్టూన్ల పోటీల్లో పాల్వంచకు చెందిన సీనియర్ కార్టూనిస్టు షేక్ సుభాని గీసిన కార్టూన్.. ప్రత్యేక బహుమతి పొందింది. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో సోమవారం జరిగిన కార్యక్రమంలో సినీ నటులు రాజేంద్రప్రసాద్, తనికెళ్ల భరణిల నుంచి సుభాని నగదు బహుమతిని అందుకున్నారు. ఈ సందర్భంగా కార్టూనిస్టు సుభానిని నటులు అభినందించారు. పత్రిక ఎడిటర్ రాము, తెలంగాణ కార్టూనిస్టుల వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జాకీర్, ప్రముఖ కార్టూనిస్టులు పాల్గొన్నారు.

చుంచుపల్లిలో భారీ వర్షం

చుంచుపల్లి, మే 21:చుంచుపల్లి మండలంలో బుధవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రత, ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. మధ్యాహ్నం సమయంలో ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై వర్షం మొదలైంది. చిన్న చిన్న చినుకులుగా మొదలైన వర్షం.. సుమారు అరగంట సేపు ఏకధాటిగా కురిసింది.

'గొర్రెల సహకార సంఘం సొసైటీ ఎన్నికలు నిర్వహించాలి'

కొత్తగూడెం టౌన్, మే 21: గొర్రెల సహకార సంఘం సొసైటీ ఎన్నికలు తక్షణమే నిర్వహించాలని, జిల్లా పశువుల ఆస్పత్రులకు సరిపడా మందులు పంపించాలని గొర్రెలు, మేకలు పెంపకం దారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడతా రవీందర్ డిమాండ్ చేశారు. సంఘం నాయకుడు మల్లెబోయిన లింగయ్య అధ్యక్షతన కొత్తగూడెంలో బుధవారం జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో పశువుల ఆస్పత్రుల్లో జీవాళ్లకు సరిపడా మందులు లేవని అన్నారు. సంఘం నాయకులు కాత్రాల తిరుపతిరావు, బొల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరిహారం

అన్నపురెడ్డిపల్లి, మే 21: మండలంలోని మర్రిగూడెం ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఇటీవల విద్యుతాఘాతంతో మృతి చెందిన మామిడి రెమెల్య కుటుంబానికి రూ.లక్ష పరిహారం చెక్కును సొసైటీ కార్యాలయంలో చైర్మన్ బోయినపల్లి సుధాకర్‌రావు బుధవారం అందించారు. ఈ చెక్కును మృతురాలు సోదరుడు రాజ్‌కుమార్ తీసుకున్నారు.

వేళలు పాటించని 'మీ సేవా'లు రద్దు

టేకులపల్లి, మే 21: వేళలు పాటించని మీ సేవా కేంద్రాలను రద్దు చేస్తామని తహసీల్దార్ పి.ముత్తయ్య హెచ్చరించారు. మీ సేవా కేంద్రాల నిర్వాహకులతో ఆయన బుధవారం తహసీల్ కార్యాలయంలో సమావేశమయ్యారు. సేవలకు నిబంధనల ప్రకారమే రుసుము తీసుకోవాలన్నారు.

నకిలీ విత్తనాలను అరికట్టాలని వినతి

ఇల్లెందు రూరల్, మే 21: మార్కెట్లో నకిలీ విత్తనాలను అరికట్టాలని కోరుతూ బీఆర్ఎస్ మండల నాయకుడు అజ్మీర బావసింగ్ నాయక్ బుధవారం వ్యవసాయ శాఖాధికారికి వినతిపత్రం ఇచ్చారు. నాయకులు సురేష్, రమేష్, హుస్సేన్, రాందాస్, చిన్నబాబు, ఉపేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

భద్రాద్రి రామయ్యకు నిత్య కల్యాణం

భద్రాచలం, మే 21: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలోని బేడా మండపంలో ఉత్సవ మూర్తులకు అర్చకులు బుధవారం నిత్య కల్యాణం నిర్వహించారు. కల్యాణ జంటలకు ప్రసాదాలు, శేష వస్త్రాలు అందజేశారు.

నేడు హనుమజ్జయంతి

భద్రాచలం, మే 21: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో గురువారం హనుమజ్జయంతికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. హనుమాన్ భక్తులు బుధవారమే చేరుకున్నారు.

పాత తార్ ప్లాంట్‌లో అగ్ని ప్రమాదం

బూర్గంపహాడ్, మే 21: మండలంలోని మోరంపల్లిబంజర్ శివారులోగల పాత తార్ ప్లాంట్‌లో అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్లాంట్ నుంచి బుధవారం అకస్మాత్తుగా మంటలు వచ్చాయి. ప్లాంట్ నిర్వాహకులు ఇచ్చిన సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది వెంటనే వెళ్లి మంటలను అదుపు చేశారు.

ఉపాధ్యాయ వృత్యంతర శిక్షణ పరిశీలన

దమ్మపేట, మే 21: దమ్మపేటలో ఉపాధ్యాయుల వృత్యంతర శిక్షణ శిబిరాన్ని రాష్ట్ర స్థాయి రిసోర్స్ పర్సన్ సిహెచ్.స్వరూప్, జిల్లా రిసోర్స్ పర్సన్ బి.శంకర్‌రావు బుధవారం పరిశీలించారు. స్వరూప్ మాట్లాడుతూ.. బోధనలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఉపాధ్యాయులు తమను తాము మెరుగుపర్చుకోవాలని, కృత్రిమ మేథ(ఏఐ)ను విస్తృతంగా ఉపయోగించాలని కోరారు. ఎంఈవో కె.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

డయాగ్నస్టిక్ సెంటర్ సీజ్

మణుగూరు టౌన్, మే 21: మణుగూరులోని రక్త పరీక్షా కేంద్రాలను డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చైతన్య, డిప్యూటీ డెమో ఫయాజ్ మోహినుద్దీన్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిబంధనలు పాటించని ఎస్‌వీ డయాగ్నస్టిక్ సెంటర్‌ను సీజ్ చేశారు.

వ్యక్తి మృతికి కారణమైన మరో వ్యక్తిపై కేసు

జూలూరుపాడు, మే 21: నిర్లక్ష్యంగా, అజాగ్రత్తగా బైక్ నడిపి వ్యక్తి మృతికి కారణమైన మరో వ్యక్తిపై జూలూరుపాడు పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన పద్దం చిన్న నర్సింహారావు, కల్తి కార్తిక్ కలిసి మంగళవారం రాత్రి ద్విచక్రవాహనంపై వ్యక్తిగత పనుల నిమిత్తం జూలూరుపాడుకు వచ్చారు. తిరిగి ఇంటికి వెళుతున్న క్రమంలో మార్గమధ్యలో గేదెలు అడ్డురాగా వేగంగా వెళ్లి గేదెలను ఢీకొట్టారు. దీంతో ద్విచక్రవాహనం కిందపడిపోవడంతో వెనుక కూర్చున్న నర్సింహారావు తల రోడ్డుకు ఢీకొనడంతో తీవ్ర రక్తస్రావమై అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. ద్విచక్రవాహనాన్ని అజాగ్రత్తగా నడిపి తన భర్త మృతికి కారకుడైన కార్తిక్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ మృతుడి భార్య పద్దం రోజా పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మల్లయ్య పేర్కొన్నారు.

పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధం

అశ్వారావుపేట, మే 21: పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని ఏఈఏ రవికుమార్ చెప్పారు. ఆయన బుధవారం స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో రైతులతో మాట్లాడారు. రైతులకు డిజిటల్ గుర్తింపు కార్డులను ప్రభుత్వం జారీ చేస్తుందని చెప్పారు. ఈ కార్డుల ప్రాధాన్యాన్ని వివరించారు. మునగ సాగుపై శ్రద్ధ పెట్టాలన్నారు. ఏవో శివరాం ప్రసాద్, ఏఈవోలు సతీష్, షకీరాబాను పాల్గొన్నారు.

గనిలో విషవాయువులు..

- **అప్రమత్తమైన సింగరేణి అధికారులు..**
- **ఆలస్యంగా వెలుగులోకి ఘటన..**

రామవరం, మే 21:గనిలో విషవాయువులు వెలువడడంతో అధికారులు అప్రమత్తమై నష్ట నివారణ చర్యలు చేపట్టిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలోని పీవీకే 5 ఇంక్లైన్ భూగర్భ గనిలో ఆదివారం సెకండ్ షిఫ్టులో విష వాయువులు వెలువడుతున్న విషయాన్ని అధికారులు గుర్తించారు. వెంటనే యుద్ధ ప్రాతిపదికన నష్ట నివారణ చర్యలు చేపట్టారు. సహజంగా భూగర్భ గనుల్లో ఉండే బొగ్గు తనంతట తాను వేడెక్కుతుంది. ఆ సమయంలో భూగర్భ గనుల్లో పనిచేసే కార్మికుల కోసం పంపించే గాలి దానికి తగలడంతో అది మండి కార్బన్ మోనాక్సైడ్ అనే విషవాయువును విడుదల చేస్తుంది. తాజాగా గనిలోని 73 లెవల్ 7 రేస్ వద్ద గ్యాస్ పడినట్లు తెలుస్తోంది. కానీ అధికారులు ఈ విషయాన్ని చాలా గోప్యంగా ఉంచుతున్నారు. గ్యాస్ పడిన ప్రాంతంలోకి స్టావింగ్ విధానం ద్వారా ఇసుకగానీ లేదంటే నీటిని గానీ పంపించి మంటలను ఆర్పే పనులను వేగవంతం చేస్తున్నారు. పాత పీవీకే ప్యాన్ వద్ద పనిచేసే ఉద్యోగులు గ్యాస్ పడిన విషయాన్ని గాలి ద్వారా గుర్తించకపోవడం వల్లనే దీని తీవ్రత ఎక్కువైనట్లు తెలుస్తోంది.


పీవీకే 5 ఇంక్లైన్ గని (ఫైల్)

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

WANTED

★త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.

NT-336372-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.